


జాతీయ తెలుగు దినపత్రిక
# తెహల్కా
ప్రతి వార్త సంచలనం




హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 99 | శనివారం 16 మే, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

**జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు**

**వివరాలు వెల్లడించిన ఎన్‌టీఏ**



**తెహల్కా మే15:** ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర -మిగతా2లో

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని



**-ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా**
**-రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా**
**-రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా**
**-సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు**

**తెహల్కా మే15:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని -మిగతా2లో




# ఇందిరమ్మ ఇళ్లపై బిగ్ అప్‌డేట్..

**మంత్రి పొంగులేటి ప్రకటన**

**తెహల్కా మే15:** జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. తొలి విడతలో మూడు లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పుకొచ్చారు. 2.90 లక్షల ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి అయిందని.. ఇప్పటికే 50 వేల గృహప్రవేశాలు పూర్తి చేశామని వివరించారు. వరంగల్, ఖమ్మం జిల్లా హౌసింగ్, రెవెన్యూ అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. -మిగతా2లో

# ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

**ఇక సైకిలే దిక్కన్న అఖిలేశ్ యాదవ్**



**తెహల్కా మే15:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది.

-మిగతా2లో

# పెట్రో ధరల పెంపు అనివార్యం

**కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**తెహల్కా మే15:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. -మిగతా2లో

# ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు కానీ!

**కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత**

**పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య**

**అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత**




**తెహల్కా మే15:** ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన -మిగతా2లో

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

**లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు**

**ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం**





**తెహల్కా మే15:** ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో..లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం 2లో



# ఎన్నికలు కాగానే పెట్రోల్ ధరలు పెంచారు

**-మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం**

**-మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ**

**తెహల్కా మే15:** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని 2లో

# తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

**సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి**



**తెహల్కా మే15:** ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు. -మిగతా2లో

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

-మొదటిపేజీ **తరువాయి:** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

-మొదటిపేజీ **తరువాయి:** ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

-మొదటిపేజీ **తరువాయి:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం. ఇక, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఆర్థిక ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈక్రమంలోనే లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

# పెట్రో ధరల పెంపు అనివార్యం

-మొదటిపేజీ **తరువాయి:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

# చిరుజల్లులతో నగరవాసులకు ఉపశమనం

-మొదటిపేజీ **తరువాయి:** గత కొద్దిరోజులుగా మండుతున్న ఎండలతో ఉక్కపోతకు గురైన ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులు కొంత ఉపశమనం కలిగించాయి. పెరిగిన ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు వర్షంతో చల్లని వాతావరణం ఏర్పడింది. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకోవడంతో అంబర్‌పేట పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోజంతా ఉన్న వేడి తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడింది. ఎండలతో అలసిపోయిన ప్రజలు ఈ వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే సాయంత్రం సమయంలో కురిసిన వర్షం కారణంగా రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రధాన రహదారులపై స్వల్పంగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఇళ్లకు బయలుదేరిన ఆఫీసు సిబ్బంది ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు పడ్డారు. పిల్లలు, యువత వర్షాన్ని ఆస్వాదిస్తుండగా, వ్యాపారులు మాత్రం ఆకస్మిక వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గే అవకాశముందని అధికారులు చెప్పారు.



## ఇందిరమ్మ ఇళ్లపై బిగ్ అప్‌డేట్..

-మొదటిపేజీ **తరువాయి:** ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. మరో 2 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని ప్రస్తావించారు. ఐటీడీఏ ప్రాంతాలకు అదనపు ఇళ్లు కేటాయిస్తున్నామని తెలిపారు.

**అర్హులందరికీ ఇళ్లు..**

అర్హులందరికీ ఇళ్లు వచ్చే వరకు 3, 4 విడతలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాత ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడా కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. 600 చదరపు అడుగుల ఇళ్ల బిల్లులు క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఫారెస్ట్, సింగరేణి అడ్డంకులు సృష్టించవద్దని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉచిత ఇసుక సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఖమ్మం, వరంగల్‌లో భూ వివాదాలపై జాయింట్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రోవర్స్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

-మొదటిపేజీ **తరువాయి:** బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

## ఎన్నికలు కాగానే పెటరో ధరలు పెంచారు

-మొదటిపేజీ **తరువాయి:** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

-మొదటిపేజీ **తరువాయి:** గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!

-మొదటిపేజీ **తరువాయి:** ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

# కుల కార్పొరేషన్లకు నిధులు, విధులు కేటాయిస్తాం





-మంత్రి పొన్నం ప్రభాకర్

తెహల్కా, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుల కార్పొరేషన్లకు త్వరలోనే నిధులు కేటాయిస్తామని, వారి విధుల విషయంలో కూడా స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ బీసీ కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, వీటి ద్వారా ఆయా కులాల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని వెల్లడించారు. పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్ గా దొంగరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ గా బుడగం శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్ లోని సంక్షేమ భవన్ లో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ కమిషనర్ బాలమాయా దేవి నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి. విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ కార్పొరేషన్, బీసీ సంక్షేమ శాఖ ద్వారా వివిధ కార్యక్రమాలు అమలు చేసుకుంటూనే, వివిధ కుల కార్పొరేషన్ల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని కార్పొరేషన్లకు తప్పక నిధులు కేటాయిస్తామని, వారు ఆ నిధులను ఎలా ఖర్చు చేయాలి, కార్పొరేషన్ బాధ్యతలు ఏమిటి అనే విషయంలో స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో పెరిక కులం అందరికీ ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలు చేస్తున్నదని అభినందించారు. కుల ఒక్కటిగా సమైక్యంగా ఉండడంతో పాటు 50 ఏళ్లకు పైగా విద్యార్థుల కోసం హాస్టల్ నిర్వహిస్తున్నదని, కొత్తగా బాలికల హాస్టల్ కూడా నిర్మిస్తుండడం గొప్ప విషయమన్నారు. కోకాపేటలో కూడా పెరిక కులస్తులు స్వయంగా విరాళాలతో ఆత్మగౌరవ భవనం నిర్మించు కుంటున్నారని, దీనికి తప్పక ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి, పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, మద్దా లింగయ్య, వీర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష





తెహల్కా, హైదరాబాద్:

హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సీఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హైస్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సీఎస్ తెలిపారు. హైదరాబాద్ -- పూణే -- ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ -- బెంగళూరు కారిడార్, హైదరాబాద్ -- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్ఎండీఏ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సీఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు







-లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జా ప్యం లేకుండా చూడాలి. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

పోచంపల్లి మండలం జాలూరు గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగు తున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులను, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఎన్ని రోజులు అయ్యిందని, ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని కలెక్టర్ అడిగితెలుసుకున్నారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఎంత ధాన్యం నిల్వ ఉ న్నాయని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు కొన సాగించాలని సూచించారు. రోజుకు ఎన్ని లారీల ధాన్యం లోడింగ్ చేసి పంపుతున్నారని అడిగి తెలుసుకున్నారు. లారీలు సరిపడా ఉన్నాయా అని ఆరా తీశారు. లారీలు తక్కువగా రావడం వల్ల కాంటా ప్రక్రియలో ఏమైనా ఆల స్యం జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చిన తర్వా త ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈరోజు నుంచే ప్రతిరోజూ కనీసం 8 నుంచి 10 లారీలు లోడ్ అయ్యే లా చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. అందుకు అను గుణంగా ధాన్యం కాంటా వేయాల ని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చూ డాలన్నారు. ధాన్యం కొనుగోలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, సంబంధిత అధి కారులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ జన్మదినోత్సవం





యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జ హంగీర్ కు జన్మదిన శు భాకాంక్ష లు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరే కార్ శ్రీను.అనం తరం శాలువాతో ఘనంగా సత్క రించి,యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి లడ్డు ప్రసాదం అంద జేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయ కులు యూత్ కాంగ్రెస్ నాయకులు కాకునూరి మహేందర్ గాజులకృష్ణ గుత్తి శివుడు పుట్ట శివకుమార్ సి ల్వర్ శీను గోపే ఎల్లయ్య తదితరు లు పాల్గొన్నారు.

## ప్రజా క్షేమాన్ని కాంక్షించు

..................................

ప్రకృతిలోని పంచభూతాలు
మనిషి మనుగడకు దోహదం చేస్తే ..
నేడు మారణ హోమం మనిషితనాన్ని
కూకటి వేళ్ళతో కూల్చివేస్తుంది!
అది ధన అహంకారమా?
లేక అధికార దాహమా?
రాబందువుల్లా రాజ్యాలు కూల్చడం..
రణరంగం సృష్టించడం..
అశాంతి అభద్రతతో
ప్రజల్నిభయభ్రాంతులను చేయడం
యేండ్లకేండ్లు శత్రుత్వాన్ని పెంచీ పోషిస్తూ..
అనుబాంబుల అంధకారంలో జీవిస్తూ..
ఎంతకాలం ఈ ఉన్మాద యుద్ధకాంక్ష?
ఒకసారి
ప్రజా క్షేమాన్ని కాంక్షించి చూడు..
నీవు సైతం దేవుడిగా కొలువబడుతవు!
మానవతను పూయించి చూడు..
నీవు కూడా మనిషిగా ప్రేమించబడతవు!
ఒక యుద్ధాన్ని విరమించి చూడు..
ఎంత విధ్వంసాన్ని ఆపగలవో!!

**ఐరేణి కృష్ణవేణి**
**సిద్ధిపేట జిల్లా**
**చరవాణి:9652407121**

## సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు నిర్వహిస్తున్న సర్వీస్ రోడ్డు పనులను పర్యవేక్షించిన అరికెపూడి గాంధీ



కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ మే 15

శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పి ఎ సి చైర్మన్ వివేకానంద నగర్ డివిజన్ మెయిన్ రోడ్డు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు సర్వీస్ రోడ్డు గురించి మిగిలిపోయిన రోడ్డు గురించి ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఎలక్ట్రిసిటీ అధికారులను ట్రాఫిక్ పోలీస్ అధికారుల సమక్షంలో రోడ్డుపై ఉన్న పోల్స్ ను నేమ్ బోర్డులను ముందుకు వచ్చిన షెడ్లను తొలగించవలసిందిగా సూచించారు ఎమ్మెల్యే పిలుపుమేరకు షాపు ఓనర్ ముందున్న బోర్డులను పైపులను తొలగించి సర్వీస్ రోడ్డు పూర్తి చేయడానికి ఎమ్మెల్యే కి అధికారులకు సహకరిస్తామని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి తెలిపారు, ఈ కార్యక్రమంలో టిపిఎస్ మధుగారు ఎలక్ట్రిసిటీ ఏఈ చైతన్య ట్రాఫిక్ పోలీసులు సిఐ పాల్గొన్నారు ఎమ్మెల్యే సూచన మేరకు త్వరలోనే మిగిలిపోయిన రోడ్డు పనులు వెంటనే చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు, ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి నర్సింగ్ రావు లక్ష్మీనారాయణ కిషోర్ జి ప్రసాద్ వెంకటేశ్వరరావు కె.వి.రావు కొండారెడ్డి డి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు అధ్యక్షులు జై పురేందర్ రెడ్డి ఎమ్మెల్యే గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంధన ధరలు పెంపును రాజకీయంగా వాడుకుంటున్న పార్టీలు

-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్



తెహల్కా, హైదరాబాద్:

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పని పాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్యమైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయన్నారు.

# ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తు

**-2022 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోనే సనత్‌నగర్, ఎల్‌బీనగర్, ఆల్వాల్ టీఐఎంఎస్ టైమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల శంకుస్థాపన చేసిన కెసిఆర్, ఎర్రబెల్లి సతీష్ రావు**

కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ మే 15




కెసిఆర్ విజన్‌తోనే టీఐఎంఎస్ (టైమ్స్) వంటి భారీ ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ 1000 పడకల ఆసుపత్రులు తెలంగాణకు వచ్చాయి. హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మితమైన టీఐఎంఎస్ (టైమ్స్) సూపర్ స్పెషాలిటీ 1000 పడకల ఆసుపత్రి తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తోంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చింది. కేటీర్ తో కలిసి టిఐఎంఎస్ (టైమ్స్) ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా బీ.ఆర్.ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కెసిఆర్ తెలంగాణలో ఆరోగ్య రంగాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు" అని పేర్కొన్నారు. టీఐఎంఎస్ (టైమ్స్) వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు తెలంగాణ ప్రజలకు గొప్ప వరమని ఆయన అన్నారు.

# మే 20వ తేదిన దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్




యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

ఆన్లైన్ ఫార్మసీల ధోరణికి నిరసన గా మే 20న దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్ కు AIOCD పిలుపు నిచ్చింది. ఈ సమ్మెలో భాగంగా సుమారు 12.40 లక్షల దుకాణా లు మూతబడనున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ప్రిస్క్రి ప్షన్ లేకుండా మందులు అమ్మడం భారీ డిస్కౌంట్లతో చిరు వ్యాపారు ల పొట్ట కొట్టడాన్ని అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆన్లై న్ అమ్మకాలను నియంత్రించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమకారులసంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మెరుగు మధు నియామకం



యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

తెలంగాణ ఉద్యమకారులసంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా భువ నగిరి పట్టణానికి చెందిన మెరుగు మధు ని నియమిస్తూ రాష్ట్ర అధ్య క్షుడు పూస శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా అవి వివిధ ఉద్య మకారుల సంఘాలను సమైక్య పరచడానికి, ఏకతాటిపై తీసుకొని వ చ్చి మలిదశ తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి న హామీలను అమలు చేసే విధం గాఉద్యమాన్ని ఉధృతంచేయాల్సి ఉందని పూస శీను అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీ లను నెరవేర్చడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ఐక్యం చేసే ప్ర యత్నం చేస్తానని ఈ సందర్భంగా మెరుగు మధు అన్నారు.

# ప్రజల మనసు గెలిచిన సర్పంచ్ దేశపాగ నరసింహ





**-ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పుస్తె మెట్టెలు అందజేస్తున్న సేవాభావి నాయకుడు**

తెహెల్కా రంగారెడ్డి జిల్లా మే15 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నందుపల్లి గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ గ్రామ ప్రజల అభిమానం పొందుతున్నారు. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా అవసరమైన వారికి పుస్తె మెట్టెలు అందజేస్తూ సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా కల్వకోల్ కిరణ్‌కు, సంఘం మైసయ్యకు పుస్తె మెట్టెలు కానుకగా అందజేశారు. గ్రామంలో పలువురికి ఇదే విధంగా సహాయం అందించడంతో గ్రామస్తులు సర్పంచ్ దేశపాగ నరసింహకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సర్పంచ్ దేశపాగ నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ ఎజాస్, కాశకోని జగదీష్ గౌడ్ దంపతులు, మాజీ వార్డు సభ్యులు, కల్వకోల్ జంగయ్య, కల్వకోల్ మహేందర్, 4వ వార్డు సభ్యుడు గోరి చంద్రయ్య, కర్రే సత్తయ్య, హబీబ్ తదితరులు పాల్గొన్నారు

# నీట్ కుంభకోణంపై యువజన కాంగ్రెస్ సమర శంఖం

**-చదువుకున్నోడికి చావుదెబ్బ.. నీట్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్ అంధకారం.**

తెహెల్కా రంగారెడ్డి జిల్లా మే15 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:



మహేశ్వరం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు గొల్లూరి ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు ప్రధాని నరేంద్ర మోడీ,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.గత పదేళ్ల మోడీ పాలనలో పలు పరీక్షల పేపర్ లీకేజీలు చోటుచేసుకోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని నాయకులు విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన ప్రధాని మోడీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పేపర్ లీకేజీకి కారణమైన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన మరియు పటిష్టమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, ఉప్పుగడ్డ తాండ సర్పంచ్ రాజు నాయక్, గంగారం తండా సర్పంచ్ దేవేందర్, కోళ్లపడకల్ సర్పంచ్ చేపంగి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు సందీప్, వరుణ్, కాకి ఈశ్వర్, ఆవుల యాదయ్య, అలె కుమార్, మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు లాజర్, సుభాష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకాష్, రాఘవేందర్, శ్రీశైలం, యాదగిరి, శివ, రాజు, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్ ధర పెంపు.. సామాన్యుడి నడ్డి విరుపు

**-పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ప్రజల తరపున ఈ నిరసన కార్యక్రమం**
**-ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.**

ఎల్.బి.నగర్, మే 15, తేహేల్కా న్యూస్ ప్రతినిది మురళీమోహన్ గౌడ్.



డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రోజు ఎల్.బి.నగర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ప్రజల తరపున ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజల జీవనం తీవ్రంగా దెబ్బతింటోందని, కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఇలాంటి అన్యాయ ధరల పెంపులను అడ్డుకునేందుకు ప్రజలను చైతన్యవంతం చేస్తూ భవిష్యత్తులో కూడా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,మాజీ చైర్మన్లు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, పలు డివిజన్ల అధ్యక్షులు, మహిళ అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, యువ నాయకులు, మహిళా నాయకులు, వివిధ విభాగాల అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారితో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ భేటీ

# ఓటర్ల జాబితా సవరణపై చర్చ

తెహల్కా, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో అక్రమాలు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా లేని ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రతిపక్షాలకు పడే ఓట్లను టార్గెట్ చేస్తూ తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ, 'ఓటర్లందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరి ఓట్లను వారే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు తమ ఓటు హక్కు జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి' అని అన్నారు. ఈ భేటీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఓటర్ల జాబితాలో పారదర్శకత పాటించాలని ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించారు.



# తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

**-రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**తెహల్కా, హైదరాబాద్:**

తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్--IIకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.




**పటాన్‌చెరులో మొదటగా పరిశ్రమలు ఏర్పడ్డాయి: దామోదర రాజనర్సింహ**

ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

**సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలు తీసుకువచ్చాం: జగ్గారెడ్డి**

మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు బీహెచ్‌ఎల్, బీడీఎల్, ఓడీఎఫ్ లాంటి కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

# సికార్‌లోని కోచింగ్ సంస్థల మధ్య పోటీ వల్లనే నీట్ పేపర్ లీక్

**-అంతర్గత విభేదాల కారణంగానే వెలుగులోకి సంచలన విషయాలు**

**తెహల్కా, హైదరాబాద్ :**

నీట్ యూజీ 2026 పేపర్ లీక్ కేసులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. నీట్ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజస్థాన్‌కు చెందిన కుటుంబం గతంలోనూ వైద్య ప్రవేశ పరీక్షల పేపర్లను లీక్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. రాజస్థాన్ పోలీసుల సమాచారం ప్రకారం.. జైపూర్ జిల్లా జంవా రామ్‌గఢ్‌కు చెందిన మంగీలాల్ బివాల్, దినేష్ బివాల్ సోదరులు ఈ ఏడాది మాత్రమే కాకుండా గత కొన్ని సంవత్సరాలుగా మెడికల్ ఎంట్రన్స్ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసి విక్రయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఇద్దరు సోదరులు రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతంలోని కోచింగ్ సెంటర్లకు ప్రశ్నపత్రాలు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. ముందుగా తమ కుటుంబ సభ్యుల కోసం ప్రశ్నపత్రాలను సేకరించి, అనంతరం ఇతరులకు భారీ మొత్తాలకు విక్రయించినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా బివాల్ కుటుంబానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు పరీక్షకు ముందే నీట్ 2025 ప్రశ్నాపత్రం అందినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. మంగీలాల్ కుమారుడు వికాస్ బివాల్ ప్రస్తుతం సవాయి మాధోపూర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అతడికి కూడా దీంట్లో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నపత్రాల సేకరణ, పంపిణీ కోసం నిందితులు రూ.65 లక్షలు చెల్లించినట్లు దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం కోచింగ్ సెంటర్ల మాఫియా ఆధ్వర్యంలో సాగిందని.. ఇది సాధారణ పేపర్ లీక్ కేసు కాదని అంటున్నారు. సంవత్సరాలుగా వ్యవస్థీకృతంగా నడుస్తున్న అక్రమ నెట్‌వర్క్ అని పేర్కొంటున్నారు. సికార్‌లోని కోచింగ్ సంస్థల మధ్య పోటీ, అంతర్గత విభేదాల కారణంగానే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. నీట్ పేపర్ లీక్ వివాదం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి దారి తీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం నీట్ యూజీ పరీక్షను రద్దు చేసి కొత్త తేదీలను ప్రకటించడమే కాకుండా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. రంగంలోకి దిగిన సీబీఐ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసింది. మరోవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా ప్రశ్నపత్రం లీక్ జరిగిన విషయాన్ని అంగీకరించారు. వ్యవస్థలో లోపం జరిగిందని.. దీనికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.




# కాచిగూడ మున్నూరు కాపు సంఘం విద్యార్థి వసతి గృహం సేవా భావంతో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం





**-మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ..**

**హైదరాబాద్ : మే 15;**

కాచిగూడ మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం , రాష్ట్ర దేవాదాయ, దర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఉచిత మేగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ మెగా వైద్య శిబిరంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని , మున్నూరు కాపు సంఘం విద్యార్థి వసతి గృహం సేవా భావంతో చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. పేద ప్రజలకు మంచి ఆరోగ్య సేవలను చేదువ చేయాలని సంకల్పంతో ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వసతి గృహం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు దడువై రాఘవేందర్ తెలిపారు. దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్య చంద్రారెడ్డి, కిమ్స్ సన్ షైన్ కార్డియాలజీ హెచ్ ఓ డీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి మాట్లాడుతూ ...ఈవైద్య పరీక్షల ద్వారా వ్యాధి లక్షణాలను ముందుగానే కనుగొని తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. ఈ ఉచిత క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిమ్స్ సన్ షైన్ కార్డియాలజీ హెచ్ ఓ డీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ చందర్ తేజవత్ ల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, ఆప్తమాలజీ, ఫెర్టిలిటీ కౌన్సిలింగ్, జనరల్ ఫిజిషియన్, బీపీ, జీఆర్ బిఎస్, బిఎండి, వెయిట్, 2 డిఈకో, ఈసీజీ తదితర వైద్య విభాగాల వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి నివారణ చర్యలను వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కుటుంబ సభ్యులు దడువై రాధాకృష్ణ, ఏనుగుల మాణిక్ ప్రభు మరియు మాజీ ట్రస్టీలు ఆకుల పాండురంగారావు, మంద సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

బంగారం ధరలు

manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Google play App Store
GOLD & SILVER RATES

| | | | |
|---|---|---|---|
| 24 kt | ₹ | 1,57,910 | 10gms |
| 22 kt | ₹ | 1,44,750 | 10gms |
| SILVER | ₹ | 3,05,000 | 1kg |

Contact: 6309 111299 | 99120 10888

## భూగర్భజలాల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

**-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**తెహల్కా, హైదరాబాద్:**

భూగర్భ జలాల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ ,డిప్యూటి డైరెక్టర్ పి.జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ అన్నది అత్యంత ప్రాధాన్యతంశమని ఈ విషయంలో రైతులకు ప్రత్యేక అవగాహన కలిగించెందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు. అదే సమయంలో నీటిని సమర్ధవంతంగా వినియోగించుకునేలా చూడడంతో పాటు వృధా గా పోయే నీటిని నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో భూగర్భ జలాల లభ్యత పెరుగుతున్నప్పటికీ అదే స్థాయిలో నీటి వినియోగం పెరుగుతున్నందున నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 2024తో పోల్చిచూసినపుడు 2025 లో జలాల వినియోగం 45.93 శాతం నుండి 46.86 శాతానికి పెరిగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.భూగర్భ జలాల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా ప్రజల్లోకి టిదుకెళ్లాలని నీటి సంరక్షణలో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన అధికారులకు వివరించారు. అధికంగా భూగర్భ జలాల వినియోగం అవుతున్న ప్రాంతాలలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా నియంత్రణ మీద దృష్టి సారించేయాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకునెందుకు గాను ఇంకుడుగుంటల నిర్మాణాన్ని ఇబ్బడిముబ్బడిగా ప్రోత్సాహించాలని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల పరిమాణాలని నిరంతరం గుర్తించేందుకు వీలుగా 1,771 ఫిజోమిటర్లను వినియోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పైగా భూగర్భ జలాల నియంత్రణతో గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ కు ఆదాయం లభిస్తుందన్నారు. పరిశ్రమలు, మైనింగ్ యూనిట్లు , అపార్టుమెంట్లు,ప్యాజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లకు భూగర్భ జలాల వినియోగానికి అనుమతులు ఇవ్వడం ద్వారా వినియోగ చార్జీల రూపంలో 25.80 కోట్లు గడించినట్లు ఆయన తెలిపారు. జాతీయ హైడ్రాలోజి ప్రాజెక్టు అమలులో ఉత్తమ పనితీరు కనబర్చిన శాఖల్లో తెలంగాణా గ్రౌండ్ వాటర్ విభాగం ఒకటిగా గుర్తింపు పొందడం అభినందనీయమని, ఇకపై భూగర్భ జలాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధస్సు తో మరిన్ని సత్ఫాలితాలూ సాధించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధిక వినియోగ ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగంపై నియంత్రణలు కఠినతరం చేయడంతో పాటు, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను మెరుగుపరచాలని, భూగర్భ జలాల వినియోగంపై శాఖల మధ్య సమన్వయంతో నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి భూగర్భ జలాల కమిటీల సమావేశాలను జిల్లా కలెక్టర్లు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. భూగర్భ జలాల వినియోగం, రీచార్జ్ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. 2025 సంవత్సరంలో రాష్ట్రంలో భూగర్భ జలాల రీచార్జ్ గణనీయంగా పెరిగిందని సమీక్షలో అధికారులు వెల్లడించారు.

2024లో 18.44 లక్షల హెక్టారు మీటర్లుగా ఉన్న వార్షిక రీచార్జ్ 2025లో 19.61 లక్షల హెక్టారు మీటర్లకు పెరిగి సుమారు 1.17 లక్షల హెక్టారు మీటర్ల వృద్ధి నమోదైంది. అయితే అదే సమయంలో భూగర్భ జలాల వినియోగం కూడా 8.45 లక్షల హెక్టారు మీటర్ల నుంచి 9.18 లక్షల హెక్టారు మీటర్లకు పెరిగినట్లు అధికారులు వివరించారు. తాజా భూగర్భ జలాల అంచనాల్లో అధిక వినియోగ ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాల వివరాలను జిల్లా యంత్రాంగానికి అధికారికంగా పంపించి, అక్కడ కొత్త బోర్‌వెల్ తవ్వకాలు మరియు అదనపు భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలాల ఒత్తిడి అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోనే ఎనిమిది మండలాలు అధిక వినియోగ కేటగిరీలో ఉన్నాయని వెల్లడించారు. ఇసుక తవ్వకాల అనుమతులకు ముందు భూగర్భ జలాల శాఖతో తప్పనిసరిగా సంప్రదింపులు జరపాల్సిన అవసరంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,771 పైజోమీటర్లు, 352 పరిశీలనా బావులు, 921 కమాండ్ ఏరియా పరిశీలనా బావులు, 64 స్ట్రీమ్‌ఫ్లో చెక్‌పాయింట్ల ద్వారా భూగర్భ జలాల స్థాయిలను పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బోర్‌వెల్ కార్యక్రమాల పురోగతినీ సమావేశంలో సమీక్షించారు.సబ్‌ప్లాన్ కింద మంజూరైన బోర్‌వెల్‌లను తవ్వి లబ్ధిదారులకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేస్తున్న భూగర్భ జలాల సంరక్షణ కార్యక్రమాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనువైన వినూత్న ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల మట్టాన్ని మెరుగుపరచడానికి భూగర్భ జలాల శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పరిశ్రమల శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## 'రాక్షసపురం' సినిమా ప్రేక్షకాదరణతో విజయం సాధించడం సంతోషంగా ఉంది

- చిత్ర సమర్పకులు : కె.ఎస్.రామారావు



ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు తెలుగు ప్రేక్షకులకు అందించిన లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ రోజు (మే 15న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు వచ్చిన 'రాక్షసపురం' సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

చిత్ర సమర్పకులు కె.ఎస్.రామారావు మాట్లాడుతూ – 'రాక్షసపురం' చిత్రాన్ని 147కి పైగా థియేటర్స్ లో రిలీజ్ చేశాం. సినిమా చూసిన వాళు చాలా బాగుందని అంటున్నారు. కలెక్షన్స్ కొన్ని చోట్ల బాగున్నాయి. కొన్ని చోట్ల ఇంకా పికప్ అవుతున్నాయి. సినిమా చూసిన ప్రేక్షకులు మాత్రం మూవీని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. నా స్నేహితుడు సతీష్ ఈ సినిమా చూడమని అడిగారు. మూవీ చూస్తుంటే కథ నేపథ్యం, ఐడియా చాలా బాగుందని అనిపించింది. క్రిస్టోఫర్ నోలన్ సిక్స్త్ సెన్స్ అనే సినిమాలోలా ఒక కొత్తదనం నిండిన సినిమా 'రాక్షసపురం' అనే ఫీల్ కలిగింది. సస్పెన్స్, మర్డర్ మిస్టరీ వెరైటీగా అనిపిస్తుంది. డైరెక్టర్ రవి సారంగ రూపొందించిన మంచి చిత్రమిది. ఇలాంటి చిత్రాన్ని తెలుగు ఆడియెన్స్ కు అందించాలని డబ్బింగ్ చేసి రిలీజ్ చేశాను. ఇప్పుడు ఐపీఎల్ నడుస్తుంది కాబట్టి యూత్ ఎక్కువగా అదే చూస్తున్నారు. ఏ సినిమాకూ ఆశించినంత కలెక్షన్స్ లేవు. మేము జూన్ లో ఈ సినిమాను రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో ఈరోజు మే15న రిలీజ్ చేయాల్సివచ్చింది. అయినా మాకు మంచి రిజల్ట్ వచ్చింది. సినిమా బాగుందనే టాక్ వస్తోంది. ఈ చిత్రాన్ని తమదే అనేంతగా ముందుండి నడిపించిన మా రామసత్యనారాయణ గారికి కృతజ్ఞతలు చెబుతున్నా. ప్రతి థియేటర్ వారితో మాట్లాడి ప్రేక్షకుల దగ్గరకు సినిమాను రామసత్యనారాయణ తీసుకెళ్లారు. ఈ సినిమాకు దక్కుతున్న సక్సెస్ కు కారణం డైరెక్టర్ రవి సారంగ, రామసత్యనారాయణ. మంచి ప్రచారం కల్పించిన సురేష్ కొండేటి థ్యాంక్స్. మా టీమ్ లో రామసత్యనారాయణ ఉంటారు. మేము మరిన్ని మూవీస్ చేస్తాం. చిన్న చిత్రం నిర్మిస్తే ఒక సమస్య, పెద్ద సినిమా నిర్మిస్తే మరో సమస్య ప్రొడ్యూసర్ కు ఎదురవుతోంది. ఒకప్పుడు ఏడాది పాటు ఆడిన సినిమాలు చూశాం. ఇప్పుడు ఎంత గొప్ప చిత్రమైనా వారం పదిరోజుల్లో థియేటర్స్ నుంచి తీసేస్తున్నారు. కొత్త నిర్మాతలు తమ సినిమాలను కూడా పెద్ద చిత్రాల్లాగే వందలాది థియేటర్స్ లో రిలీజ్ చేయాలని ఆశిస్తున్నారు. కానీ గ్రౌండ్ రియాలిటీ తెలుసుకోవడం లేదు. అన్నారు.

డైరెక్టర్ రవి సారంగ మాట్లాడుతూ – ఫిబ్రవరిలో మేము కన్నడలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేశాం. నెల రోజుల తర్వాత కేఎస్ రామారావు గారు మా మూవీ చూశారు. ఇప్పుడు రిలీజ్ చేశారు. ఫిబ్రవరిలో రిలీజ్ అయిన చిత్రాన్ని ఇప్పుడు తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకురావాలంటే ధైర్యం కావాలి. అలాంటి ధైర్యమున్న ప్రొడ్యూసర్ రామారావు గారికి థ్యాంక్స్ చెబుతున్నా. మా ప్రొడ్యూసర్ రవి వర్మ ఈ చిత్రాన్ని ఎంతో ప్యాషనేట్ గా నిర్మించారు. కథ ఓకే అయ్యాక, ఆ కథకు కావాల్సిన ప్రతీది సమకూర్చారు. హీరో రాజ్ బి శెట్టి తన పూర్తి సహకారం అందిస్తూ నన్ను ఎంకరేజ్ చేశారు. వీరందరి సహకారంతో ఈ చిత్రాన్ని సక్సెస్ ఫుల్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మా మూవీని ఆదరిస్తున్న తెలుగు ఆడియెన్స్ కు కృతజ్ఞతలు. అన్నారు.

నిర్మాత రామసత్యనారాయణ మాట్లాడుతూ – కె.ఎస్.రామారావు గారు అంటే నాకు గాడ్ ఫాదర్ లాంటివారు. ఆయన చేసిన చిత్రాలెన్నో ప్రేక్షకుడిగా చూసి ఆనందించాను. ఈ రోజు ఆయనతో కలిసి వర్క్ చేసే అవకాశం రావడం గర్వంగా ఉంది. ఈ సినిమాను 147 థియేటర్స్ లో రిలీజ్ చేశాం. మార్నింగ్ షోస్ కంటే మ్యాట్నీ షోస్ కు కలెక్షన్స్ పెరిగాయి. ఇంకా మౌత్ టాక్ తో మరింతగా కలెక్షన్స్ వస్తాయని ఆశిస్తున్నాం. ఈ చిత్రాన్ని దర్శకుడు రవి సారంగ ఆకట్టుకునేలా రూపొందించాడు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో మన ఊహకు అందకుండా సినిమా సాగుతుంటుంది. టీజర్, ట్రైలర్ తో మా మూవీ ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రాన్ని సురేష్ కొండేటి చేస్తున్న ప్రచారం, భారతీబాబు తెలుగు స్క్రిప్ట్, కేఎస్ రామారావు గారి పేరుకున్న ఇమేజ్ ఇవే మా సినిమా సక్సెస్ కు కారణం. అన్నారు.

**-నటీనటులు: రాజ్ బి శెట్టి తదితరులు**

**టెక్నికల్ టీమ్**

**----------------**

**దర్శకత్వం: డాక్టర్ రవి**
**నిర్మాత: కేఎస్ రామారావు**
**బ్యానర్: క్రియేటివ్ కమర్షియల్స్**

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ







-జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
-గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
-జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం
-రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెహల్కా హైదరాబాద్ :

పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సీఎం రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా, ఐటీడీఏ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివసిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే , తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారనీ , ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ నెలాఖరుకల్లా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 2 బిహెచ్ కే ఇండ్లన్నిటికీ లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకే లబ్ధి చేకూరేలా చూడాలని స్పష్టం చేసారు. డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీరు, డ్రైనేజి వంటి వాటి పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న కాలనీల్లో టవర్ ను యూనిట్ గా తీసుకుని , లబ్ధిదారుల అసోసియేషన్ ల ద్వారా పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీభూములున్నాయని, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య చాలా సరిహద్దు వివాదాలు ఉన్నాయని మంత్రి గారు అన్నారు. రెండు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్టు మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్స్ తో సర్వే నిర్వహించి భూ వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవా దృక్పథం ఉన్న వారంతా రెడ్ క్రాస్ లో సభ్యులుగా చేరాలి





యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:

సమాజ సేవ చేయాలని,నలుగురి కి సాయం చేయాలన్న తలంపుతో ఉన్నవారు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలని సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహా రెడ్డి డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి కోరారు. శుక్రవారం భువనగిరిలో పాత వివే రా హోటల్ వద్ద జిల్లా రెడ్క్రాస్ కార్యాలయంలో సభ్యత్వనమోదు స్పెషల్ డ్రైవ్ డాటా సెంటర్ ను వీరిద్దరూ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సం స్థ రెడ్ క్రాస్ లో సభ్యత్వం తీసుకు ని,తమ శక్తి మేర స్వచ్ఛంద కార్య క్రమాలలో పాల్గొనాలని,కార్యక్ర మాలు నిర్వహించాలని పిలుపుని చ్చారు.జూన్ నెల 15 వరకు నిర్వ హించేఈస్పెషల్ డ్రైవ్ కార్యక్రమం లో తమకార్యాలయంలో ఆన్లైన్లో, ఆఫ్ లైన్ లో,సభ్యత్వాలు నమో దు చేసుకోవచ్చని తెలిపారు. మండల కేంద్రాలలో తమ జిల్లా డైరెక్టర్ల వద్ద కూడా సభ్యత్వాన్ని స్వీకరించవచ్చని వివరించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల రెడ్ క్రాస్ కమిటీలను ఏర్పాటు చే సేందుకు గ్రామాలలోనూ రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు. జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ,మాట్లాడుతూ సేవా నిరతి కల వారందరూ రెడ్ క్రాస్ లో సభ్యులుగా చేరవచ్చు అని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పు డు రెడ్ క్రాస్ ద్వారా వారికి సేవ చేసే భాగ్యం కలుగుతుందని వివ రించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ డై రెక్టర్లు శేక్. హమీద్ పాశ, ఎస్.ఎన్ చారి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జంపాల అంజయ్య, రాంబాయి, డి విజన్కమిటీ డైరెక్టర్లు, ఐలేని రాంరె డ్డి, నిమ్మయ్య, జిల్లాకార్యదర్శి క్రిస్టో ఫర్, పట్టణకమిటీ డైరెక్టర్, లావణ్య కరిపే నర్సింగ్ రావ్, మచెం తదితరులు పాల్గొన్నారు.



# బిజినెస్

## డాలర్‌తో పోలిస్తే ఆల్‌టైం కనిష్ఠానికి పడిపోయిన రూపాయి విలువ




అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి ఒక దశలో 96.14 వద్ద రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకోవడం.. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ మరింత బలపడటానికి కారణమైంది. తద్వారా రూపాయి విలువ మధ్యాహ్నం గం.3 ప్రాంతానికి రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. అనంతరం కోలుకొని మధ్యాహ్నం నాలుగున్నర సమయానికి 95.82 దగ్గర కదలాడుతోంది. ఈ వారం నమోదైన రూపాయి విలువ కనిష్ఠాల పరంపరలో ఇది ఆల్ టైం పతనం. దేశ విదేశీ మారక నిల్వలను పరిరక్షించేందుకు పలు చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన కొన్ని రోజులకే దేశీయ కరెన్సీ జీవితకాల కనిష్ఠ స్థాయికి పడిపోవడం విశేషం. పశ్చిమాసియాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంక్షోభం, చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి దాదాపుగా మూసుకుపోయిన పరిణామాలు రూపాయి విలువ పతనానికి కారణాలుగా విశ్లేషిస్తున్నారు. చాలా మంది ఆర్థికవేత్తలు, వివిధ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలను తగ్గించగా, ద్రవ్యోల్బణ అంచనాలను పెంచారు. మరోవైపు, అధికారిక టోకు ధరల సూచీ(బ్రా×) దాదాపు నాలుగేళ్ల అత్యధిక స్థాయికి చేరుకుంది. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించకపోవచ్చనే సంకేతాల వల్ల డాలర్ ఇండెక్స్ బలపడిందని కూడా విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రూపాయి విలువ మరీ ఎక్కువగా పడిపోకుండా నిరోధించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×) రంగంలోకి దిగి, డాలర్లను విక్రయించడం ద్వారా పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు, రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతులు ఖరీదైనవిగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా ముడి చమురు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పప్పు ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇది ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది.

## 14 క్యారెట్ల పసిడి ఆభరణాలకే అనుమతి! భారత్‌లో ఈ రూల్ ఉండేదని తెలుసా?



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా పడిపోతుండటంతో భారత్ అదనపు సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు భారతీయులు బంగారం కొనుగోళ్లపై పరిమితులు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అయితే, భారత్ గతంలో కూడా ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొందని పరిశీలకులు చెబుతున్నారు. ఒక దశలో దేశంలో 14 క్యారెట్ల బంగారు ఆభరణాల తయారీకే అనుమతి ఉండేదని చెబుతున్నారు.

**చైనాతో యుద్ధం.. గోల్డ్ కంట్రోల్ రూల్స్**

1962లో చైనాతో యుద్ధం సమయంలో భారత్‌లో ఫారెక్స్ నిల్వలు తగ్గి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. దీంతో, ఆర్థిక పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు ప్రభుత్వం అప్పట్లో గోల్డ్ కంట్రోల్ రూల్స్‌ను అమల్లోకి తెచ్చింది. వీటి ప్రకారం, నగల వ్యాపారులకు 14 క్యారెట్లకు మించిన బంగారు ఆభరణాల తయారీకి అనుమతి ఉండేది కాదు. ఫారిన్ ఎక్స్ఛేంజ్ నిల్వలు తరిగిపోకుండా ఉండేందుకు ఈ నిబంధన అవసరమంటూ అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు లేఖ రాశారు. 24 క్యారెట్ల బంగారం రూపంలోనే గోల్డ్ స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోందని అన్నారు. దేశ సంపదలో అధిక భాగం బంగారం రూపంలో ప్రజల వద్ద నిల్వ ఉండటంతో ఇతర ఆర్థిక కార్యకలాపాలకు నిధుల కొరత పెరిగిందని కూడా ప్రభుత్వం భావించింది. అయితే, ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఆ తరువాత ఈ నిబంధనను సడలించింది. అప్పటికీ ఆర్థిక ఇక్కట్లు కొనసాగుతుండటంతో ప్రభుత్వం 1968లో గోల్డ్ కంట్రోల్ యాక్ట్‌ను తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రైవేటు వ్యక్తులు తమ వద్ద మేలిమి గోల్డ్ బార్స్, నాణేలు నిల్వ ఉంచుకునేందుకు అనుమతి ఉండేది కాదు. దేశ ప్రజలు బంగారం కొనుగోళ్ళ, నిల్వలను తగ్గిస్తే దిగుమతుల భారం తగ్గి విదేశీ కరెన్సీ నిల్వలను కాపాడుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

ఇక 1991లో ఆర్థిక సంక్షోభం సమయంలో భారత ప్రభుత్వం తన వద్ద ఉన్న బంగారం నిల్వలను విదేశాల్లో కుదువ పెట్టి రుణాన్ని సేకరించింది. ఆ తరువాత చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో కోలుకుంది. ఇక 2025-26 మధ్య కాలంలో భారత్ 72 బిలియన్ డాలర్ల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఆర్‌బీఐ లెక్కల ప్రకారం, 2026 మార్చి నాటికి భారత్ వద్ద 880.5 టన్నుల బంగారం ఉంది. ఈ పసిడి విలువ 115 బిలియన్ డాలర్లు.

# స్పోర్ట్స్

## ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్.. పాకిస్థాన్ జట్టుకు భారీ షాకిచ్చిన ఐసీసీ




ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఐసీసీ భారీ షాకిచ్చింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో పాక్ ఆడింది కేవలం మూడే టెస్టులు. అందులో రెండింట్లో ఓడిపోగా.. ఒకదాంట్లో విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజాగా ఐసీసీ నిర్ణయంతో పాయింట్ల కోతతో పాటు ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో భారీ జరిమానా పడింది. ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల భారీ తేడాతో ఘోర ఓటమిని చవి చూసింది. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో పాక్ స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ రిఫరీ ఆగ్రహానికి గురైంది. నిర్ణీత సమయానికి ఏకంగా ఎనిమిది ఓవర్లు తక్కువగా వేసిందని ఐసీసీ వెల్లడించింది. దీంతో డబ్ల్యూటీసీలో ఎనిమిది పాయింట్లను కోల్పోయింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో కేవలం నాలుగు పాయింట్లు ఉన్నాయి. దీంతో పాటు కెప్టెన్ షాన్ మసూద్‌తో పాటు ప్లేయర్లందరికీ ఒక్కొక్కరిపై 40 శాతం మ్యాచ్ ఫీజులో జరిమానా విధించింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ నిర్ణయం మేరకు ఐసీసీ ప్రకటన విడుదల చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక్కో స్లో ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం, ఒక పాయింట్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. ఇప్పుడు పాకిస్థాన్ ఏకంగా 8 ఓవర్లు ఆలస్యంగా వేయడంతో భారీ జరిమానాను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే, ఐసీసీ డబ్ల్యూటీసీ పట్టికలో ఆస్ట్రేలియా(87.50 శాతం), న్యూజిలాండ్(77.78 శాతం) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. సౌతాఫ్రికా(75), శ్రీలంక(66.67), భారత్(48.15) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

## ఇషాన్ కిషన్‌కు రూ. కోటి నజరానా




ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను బిహార్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన ఇషాన్‌కు.. బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరీ రూ.కోటి నజరానా ప్రకటించారు. సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఇషాన్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సమ్రాట్ చౌదరీ సోషల్ మీడియాలో ఫోటోలు పంచుకున్నారు. అనివార్య కారణాల వల్ల ఇషాన్ కిషన్ చాలా కాలం భారత జట్టుకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. దేశవాళీ క్రికెట్‌లో రీఎంట్రీ ఇచ్చి.. అక్కడ అద్భుతంగా రాణించి టీమిండియాలో తిరిగి చోటు సంపాదించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌కు ముందు జట్టులో చేరాడు. టోర్నీలో అద్భుత ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకున్నాడు. మొత్తం తొమ్మిది మ్యాచ్‌ల్లో 317 పరుగులు చేసి భారత్ తరఫున రెండో అత్యధిక రన్స్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. ప్రత్యేకంగా పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో 40 బంతుల్లో 77 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. ఫైనల్‌లో 25 బంతుల్లోనే 54 పరుగులు చేశాడు. ఫైనల్ మ్యాచ్‌కు ముందురోజు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తన కజిన్ సిస్టర్‌కు ఆ విజయాన్ని అంకితం ఇచ్చాడు. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతున్న ఇషాన్.. 12 మ్యాచ్‌ల్లో 420 పరుగులు చేసి మంచి ఫామ్‌లో కొనసాగుతున్నాడు.

## గౌతమ్ గంభీర్‌పై రాహుల్ ద్రవిడ్ సంచలన కామెంట్స్!




భారత జట్టు మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం టీమిండియాకు హెడ్‌కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ ఆలోచనా విధానానికి తాను వ్యతిరేకమని పరోక్షంగా ప్రస్తావించాడు. అలానే టీమిండియాలో 'సూపర్ స్టార్ కల్చర్'పై కూడా స్పందించాడు. రవిశాస్త్రి తర్వాత భారత జట్టుకు మార్గనిర్దేశకుడిగా వచ్చిన ద్రవిడ్.. జట్టును విజయపథంలో నిలిపాడు. స్కూప్ పాడ్‌కాస్ట్‌లో ద్రవిడ్ మాట్లాడుతూ.. 'ప్రతీ క్రీడకు హీరోల అవసరం ఉంది. తమ ప్రదర్శనల ద్వారానే ప్లేయర్లు హీరోలుగా మారుతారు. మైదానంలో మన ప్రదర్శన బాగుంటునే ప్రేక్షకులు మనల్ని గుర్తిస్తారు. ముఖ్యంగా భారత్‌లో అద్భుతంగా ఆడితే ఊహించని స్థాయిలో ప్రశంసలు వస్తాయి. ప్రదర్శన సరిగ్గా లేకుంటే విమర్శలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అందరి దృష్టి ఆటగాళ్ల మీదే ఉంటుంది' అని ద్రవిడ్ తెలిపాడు. 'మన ప్రదర్శనలను ప్రేక్షకులు క్షుణ్ణంగా గమనిస్తారు. కాబట్టి ఈ దేశంలో ఎంతో గొప్పగా ఆడితే తప్ప సూపర్ స్టార్ అవ్వరు. లేకుంటే దిగ్గజ ప్లేయర్ అనే హోదా రాదు. వ్యక్తిగత ప్రదర్శన బాగుంటే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించినవారము అవుతాము. సూపర్ స్టార్లు భావితరాలకు స్ఫూర్తినిస్తారు. వారి అవసరం తప్పక ఉంది' అని ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు. కాగా గంభీర్ సూపర్ స్టార్ ట్యాగులు వద్దంటూ అందరినీ ఒకే గాటన కట్టాలని చూస్తుంటే.. ద్రవిడ్ మాత్రం ఇలా స్పందించడం గమనార్హం.

# టాలీవుడ్‌లో పర్సంటేజీ వివాదం.. స్పందించిన దిల్ రాజు

**-సమస్యపై చర్చించి పరిష్కరించుకున్నామన్న దిల్ రాజు**
**-ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్‌లో సమావేశం జరిగిందని వెల్లడి**
**-ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడి**
**-పెద్ది సినిమా ఆరోగ్యకరమైన వాతావరణంలో విడుదలవుతుందని హామీ**



ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య కొనసాగుతున్న పర్సంటేజీ విధానం వివాదంపై ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు స్పందించారు. ఈ సమస్యపై చర్చించి పరిష్కరించుకున్నామని తెలిపారు. ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్‌లో సమావేశం జరిగిందని, పర్సంటేజీ విధానంపై చర్చించామని అన్నారు. ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు అభ్యంతరం చెప్పడం లేదని తెలిపారు.

పర్సంటేజీ విధానానికి సంబంధించి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని దిల్ రాజు అన్నారు. ఏ, బీ, సీ ఇలా ఆయా సెంటర్లలో థియేటర్‌ను బట్టి పర్సంటేజీని కమిటీ నిర్ణయిస్తుందని వెల్లడించారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రం జూన్ 4న ఆరోగ్యకరమైన వాతావరణంలోనే విడుదలవుతుందని పేర్కొన్నారు. ఆ విషయంలో ఎలాంటి సందేహం అక్కరలేదని అన్నారు. మల్టీప్లెక్స్‌లో ఉన్నట్లే సింగిల్ స్క్రీన్‌లలో కూడా పర్సంటేజీ విధానం కావాలని, దీనికి అంగీకరించిన సినిమాలనే ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్లు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పర్సంటేజీ విధానంతో తమకు నష్టం కలుగుతుందని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో విడుదల కానున్న 'పెద్ది' సినిమాను లక్ష్యంగా చేసుకుని ఈ డిమాండ్ తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ఈ క్రమంలో 'పెద్ది' సినిమా ఆరోగ్యకర వాతావరణంలో విడుదలవుతుందని దిల్ రాజు హామీ ఇచ్చారు.

# రామ్ చరణ్, బుచ్చిబాబు లాంగ్ డ్రైవ్...


**-జూన్ 4న థియేటర్‌లలో పెద్ది సినిమా**
**-ఈ నెల 18న పెద్ది ట్రైలర్ విడుదల**
**-పెద్ది సినిమా చాలా బాగుంటుందన్న బుచ్చిబాబు**



పెద్ది ప్రమోషన్స్ ఊపందుకుంటున్నాయి. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు లాంగ్ డ్రైవ్‌కు వెళ్లారు. చెర్రీ హీరోగా, బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం తెరకెక్కింది. ఈ సినిమా వచ్చే నెల 4వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రచారంలో జోరు పెంచింది. ఇందులో భాగంగా రామ్ చరణ్, బుచ్చిబాబు కలిసి లాంగ్ డ్రైవ్‌కు వెళ్ళారు. ఈ సమయంలో వారు 'పెద్ది' చిత్రం విడుదల, ట్రైలర్ విడుదల గురించి మాట్లాడుకున్నారు. బిజీ షెడ్యూల్‌లో తనను రామ్ చరణ్ డ్రైవ్‌కు తీసుకువచ్చాడని బుచ్చిబాబు పేర్కొన్నారు. ఇందుకు రామ్ చరణ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే సినిమా కచ్చితంగా ఎప్పుడు విడుదలవుతుందో చెప్పాలని రామ్ చరణ్ అడగడంతో, బుచ్చిబాబు స్పందిస్తూ, జూన్ 4న థియేటర్‌లలోకి వస్తుందని అన్నారు. ట్రైలర్ కూడా ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని రామ్ చరణ్ అడగ్గా... ఈ నెల 18న విడుదల చేస్తామని బుచ్చిబాబు సమాధానం చెప్పారు. పక్కాగా విడుదల చేస్తారా? అని రామ్ చరణ్ మరోసారి ప్రశ్నించగా, తప్పకుండా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. బుచ్చిబాబు మాట్లాడుతూ, పెద్ది సినిమా చాలా బాగుంటుందని అన్నారు. ఇద్దరం ఎంతో మనసు పెట్టి దీనిని పూర్తి చేశామని అన్నారు. రామ్ చరణ్ పెద్ద స్టార్, ఆయన వద్దకు 'పెద్ది' వంటి మంచి కథతో వెళితే వెంటనే అంగీకరించారని తెలిపారు.

# పవన్ కొత్త సినిమాలకు లాంగ్ బ్రేక్ తప్పదా?

**సైనస్ శస్త్ర చికిత్స తర్వాత కోలుకుంటున్న పవన్ కల్యాణ్ ఇప్పుడే షూటింగుల్లో పాల్గొనడం సురక్షితం కాదంటున్న సన్నిహితులు పాలనకు ఇబ్బంది కలగకుండా రెండు మూడు సినిమాలు చేయాలనే ఆలోచనలో పవన్**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైనస్ శస్త్రచికిత్స తర్వాత వేగంగా కోలుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి ప్రధాని మోదీ వచ్చినప్పుడు ఆయన చాలా యాక్టివ్‌గా కనిపించారు. ఇప్పటికే పాలనాపరమైన విధులను కూడా ప్రారంభించారు. అయితే, ఆయన మళ్లీ సినిమాల్లోకి ఎప్పుడు వస్తారు అనే విషయంపై మాత్రం ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. కోలుకుంటున్న సమయంలో పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నట్లు తెలుస్తోంది. గతంలో సినిమా షూటింగ్స్ సమయంలో తగిలిన పలు గాయాలను ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేయడం వల్లే ఇప్పుడు కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, ఆయన ఆరోగ్యం పూర్తిగా స్థిరపడకముందే మళ్లీ బిజీ షూటింగ్ షెడ్యూల్స్‌లోకి వెళ్లడం సురక్షితం కాదని ఆయన సన్నిహితులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా పవన్ పై భారీ రాజకీయ, పరిపాలనా బాధ్యతలు ఉన్నాయి. నిరంతర సభలు, సమీక్షా సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ఆయనపై రోజువారీ ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో సుజిత్, సురేందర్ రెడ్డి వంటి దర్శకులతో తదుపరి ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నప్పటికీ, షూటింగ్స్ ఎప్పుడు మొదలవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతానికి పవన్ కు పూర్తి విశ్రాంతి అవసరమని, ఆ తర్వాతే సినిమాలపై ఒక పద్ధతి ప్రకారం ప్లాన్ చేసుకోవాలని ఆయన సన్నిహిత వర్గాలు సలహా ఇస్తున్నాయి. ప్రభుత్వం, పాలనకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఒకటి లేదా రెండు సినిమాలను పూర్తి చేయాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. అయితే, ఇవన్నీ రాబోయే నెలల్లో ఆయన ఆరోగ్యం ఎంత త్వరగా మెరుగుపడుతుంది అనే దానిపైనే ఆధారపడి ఉంటాయి.

# 'రాంబుజ్జి'కి హాయ్ చెప్పండి... 'పెద్ది' నుంచి మరో గ్లింప్స్ వీడియో రిలీజ్

**-రామ్ చరణ్ 'పెద్ది'లో కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు**
**-'రాంబుజ్జి'గా ఎంట్రీ ఇవ్వనున్న 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు**
**-మే 18న థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేయనున్నట్లు ప్రకటన**
**-జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున సినిమా రిలీజ్**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' నుంచి చిత్రబృందం కీలక అప్‌డేట్‌ను విడుదల చేసింది. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి వచ్చిన ఈ కొత్త అప్‌డేట్ సోషల్ మీడియాలో అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ చిత్రంలో 'రాంబుజ్జి' అనే శక్తివంతమైన పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ నటిస్తుండడం తెలిసిందే. తాజాగా ఈ పాత్రకు సంబంధించి గ్లింప్స్ వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పంచుకుంది. "రాంబుజ్జికి హాయ్ చెప్పండి" అంటూ క్యాప్షన్ కూడా పెట్టింది. 'మిర్జాపూర్' వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దివ్యేందు 'పెద్ది'లో తనదైన శైలిలో నటించినట్టు గ్లింప్స్ చెబుతోంది. "ఇక అసలు ఆట మొదలవ్వబోతోంది" అంటూ చిత్రబృందం పోస్ట్ చేయడంతో ప్రమోషన్స్‌లో వేగం పుంజుకుంది. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న విడుదల చేయనున్నట్లు తెలిపారు. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వేసవి కానుకగా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యే ఈ సినిమా కోసం సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కు ధోనీ వస్తున్నాడా?

**-'పెద్ది' ట్రైలర్ లాంచ్‌కు ముఖ్య అతిథిగా ధోనీ హాజరయ్యే అవకాశం**
**-ముంబైలో మే 18న జరగనున్న గ్రాండ్ ఈవెంట్**
**-స్పోర్ట్స్ డ్రామా కావడంతో ధోనీని ఆహ్వానిస్తున్న చిత్రబృందం**
**-బాలీవుడ్ స్టార్లకు బదులుగా క్రికెటర్‌తో వినూత్న ప్రచార వ్యూహం**
**-దేశవ్యాప్తంగా 8 నగరాల్లో భారీ ప్రమోషన్లకు సన్నాహాలు**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' ప్రమోషన్ల విషయంలో చిత్రబృందం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతోంది. తెలుగు సినిమాలను హిందీలో ప్రమోట్ చేయడానికి సాధారణంగా బాలీవుడ్ స్టార్లను ఆహ్వానిస్తారు. కానీ, 'పెద్ది' మేకర్స్ ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టి, భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని రంగంలోకి దించుతున్నట్టు సమాచారం. ఈ నెల 18న ముంబైలో జరగనున్న 'పెద్ది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ధోనీని ముఖ్య అతిథిగా తీసుకు వచ్చేందుకు చర్చలు చివరి దశలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఒక స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' మూవీ. అందుకే ఈ సినిమా స్ఫూర్తికి ధోనీయే సరైన వ్యక్తి అని, ఆయన హాజరైతే సినిమాకు దేశవ్యాప్తంగా భారీ మైలేజ్ వస్తుందని చిత్రబృందం భావిస్తోంది. ఈ సినిమాలో క్రికెట్, రెజ్లింగ్ వంటి క్రీడలకు ప్రాధాన్యం ఉంది. ఇప్పటికే టీజర్లలో ఈ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఒకవేళ అన్నీ అనుకున్నట్టు జరిగితే, ఒకే వేదికపై రామ్ చరణ్, ఎంఎస్ ధోనీ కనిపించడం ఇటు సినీ అభిమానులకు, అటు క్రికెట్ ప్రేమికులకు కనుల పండుగ అవుతుంది. ఇక, మూవీలోని ఈ పాత్ర కోసం రామ్ చరణ్ ప్రత్యేకంగా క్రికెట్, రెజ్లింగ్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. ఒక క్రీడాకారుడిగా చరణ్ నటిస్తున్న తొలి సినిమా కావడంతో ధోనీ రాక సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తుందని అంచనా వేస్తున్నారు కేవలం ఈవెంట్‌కే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాలకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మే 18 నుంచి జూన్ 2 మధ్య ముంబై, భోపాల్, బెంగళూరు సహా మొత్తం 8 ప్రధాన నగరాల్లో ప్రమోషన్లు జరగనున్నాయి. ఈ ప్రమోషన్ల కోసం రామ్ చరణ్ విస్తృతంగా పర్యటించనున్నారు. త్వరలోనే ధోనీ రాకపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY TEHELKA MEDIA NETWORK ,DIGITAL NEWS .Regd no:2019/28814, EDITOR :K.CHANDRA SHEKHAR, EXECUTIVE EDITOR :K.SRINIVAS RAO, G6 MES Colony, Alwal , Secunderabad -500010.e-mail:Tehelkamedianetworks@gmail.com